సాక్షి
కామారెడ్డి
సోమవారం, 6, అక్టోబర్, 2025



అద్దె భవనంలో హాస్టల్

ఎల్లారెడ్డి బాలుర హాస్టల్‌కు సొంత భవనం లేకపోవడంతో అరకొర సౌకర్యాల మధ్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸



బీజేపీ అభ్యర్థులను..

స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని నాయకులు పార్టీ శ్రేణులను కోరారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.9 /22.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'మార్పు కోసం కార్యాచరణ ఉండాలి'



కామారెడ్డి అర్బన్ : సమాజంలో మార్పు కోసం మాటలు అంటే సరిపోదని, కార్యాచరణ ఉండాలని తెలంగాణ సామాజిక సమరసత వేదిక ప్రాంత కన్వీనర్ అప్పాల ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం కామారెడ్డి పట్టణంలోని శ్రీరాంనగర్, కల్కినగర్, ఈశ్వరీపుర భవానీరోడ్డు, సరంపల్లి, పంచముఖి హనుమాన్ బస్తీలలో పథ సంచలన్ నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో అప్పాల ప్రసాద్ హిందూవాహిని ప్రాంత సంఘటన మంత్రి యాదిరెడ్డి, సరస్వతి విద్యాపీఠం విభాగ్ కార్యదర్శి హరిస్మరణ్‌రెడ్డి మాట్లాడారు. దైవభక్తితో పాటు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. కుటుంబం, సమాజం, సంప్రదాయాలు, దేశభక్తి, పర్యావరణం మాటలకు పరిమితం కాకుండా కార్యాచరణతో ఉండాలన్నారు. పిల్లలకు వీరులు, వీరనారీ మణుల చరిత్రను చెప్పాలని సూచించారు. ఆచార్య మసన సత్యమిత్ర ఆర్య, ఆర్ఎస్ఎస్ నగర కార్యావాహ శివరాజు, ప్రతినిధులు పవన్‌కుమార్, పాండ్రే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సోయా కోతలు




మద్నూర్ : డోంగ్లీ, మద్నూర్ మండలాల్లో సోయాబీన్ పంట కోతలు జోరుగా కొనసాగుతున్నాయి. అయితే ఈసారి సోయా రైతులకు నిరాశే మిగిలింది. పంట కోతల సమయంలో కురిసిన భారీ వర్షాలతో మొక్కలపైనే మొలకలు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోయా ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా నాలుగైదు క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయని చెబుతున్నారు.

నిజాంసాగర్‌లోకి 19 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్ : ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 19 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 5 గేట్ల ద్వారా 19 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)కు ఆదివారం సాయంత్రం 1,404.90అడుగుల (17.658టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

టోల్‌గేట్ వద్ద పండుగ రద్దీ



భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద తెల్లవారుజామున వాహనాల రద్దీ

భిక్కనూరు : మండల కేంద్ర సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వాహనాల రద్దీ విపరీతంగా ఉంది. బతుకమ్మ, దసరా పండుగల కోసం సొంత ఊళ్లకు వచ్చిన వారు తిరిగి వెళ్తుండడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. కామారెడ్డి నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు మూడు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. కామారెడ్డి జిల్లాతో పాటు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు చెందినవారూ హైదరాబాద్‌కు ఇదే రూట్‌లో వెళ్లాల్సి ఉంటుంది. దీంతో క్యూ భారీగా ఉంది. టోల్‌ప్లాజా సిబ్బంది వాహనాదారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.

రెండేళ్లాగితే మనదే అధికారం

- వేధించే అధికారుల సంగతి తేలుస్తాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/నాగిరెడ్డిపేట/గాంధారి : ''ఇంకో రెండేండ్లు ఆగితే మనదే అధికారం. వంద సీట్లతో అధికారంలోకి వస్తాం. ఈసారి అభివృద్ధితో పాటు వేధించే అధికారుల సంగతీ తేలుస్తాం' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన జిల్లాలో పర్యటించారు. నాగిరెడ్డిపేట మండలంలో వరదలతో మునిగిన పంటలను పరిశీలించారు. గాంధారి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీలో పలువురు చేరారు. ఆయా కార్యక్రమాలలో హరీశ్‌రావు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందన్నారు. రోడ్లు, వంతెనలు, కాలువలు, చెరువులు దెబ్బతిన్నాయని వేలాది ఎకరాల్లో పంటలు నాశనమయ్యాయని పేర్కొన్నారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని, సీఎం వచ్చి పదిహేను రోజుల్లో రివ్యూ చేస్తానని చెప్పాడని, నెల రోజులైనా రివ్యూ చేయకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. నెల రోజులైనా నయాపైసా సాయం చేయలేదని విమర్శించారు. సీఎం వచ్చి చూసిన వంతెన నెల రోజులు గడచినా పునరుద్ధరణ జరగలేదని, జిల్లా కేంద్రానికి బస్సులు నడవక ఎల్లారెడ్డి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థుల చదువులకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. కామారెడ్డి వరదలకు ప్రత్యేక ప్యాకేజీ వస్తుందనుకుంటే నయాపైసా ఇవ్వలేదన్నారు. దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ. 25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మాటలు చెప్పడమే పని..

రేవంత్‌రెడ్డి మాటలు చెప్పడమే తప్ప చేసేదేమీ లేదని, కేసీఆర్ కట్టిన వాటికి రిబ్బన్లు కట్ చేయడం, కేసీఆర్ పెట్టిన పథకాలను కత్తిరించడమే ఆయన డ్యూటీ అయ్యిందని హరీశ్‌రావు విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తానని చెప్పి, కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లు, నిర్వహించిన పరీక్షలకు సంబంధించి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి తానే ఉద్యోగాలిచ్చినట్టు చెప్పుకుంటున్నాడన్నారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్స్, బతుకమ్మ చీరెలు బంద్ చేశారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో అంతటా భూముల ధరలు పెరిగాయని, రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక భూముల ధరలు పాతాళానికి పడిపోయాయని విమర్శించారు. ప్రజల మీద పన్నులు వేయడం తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలను వంచించి దోచుకోవడమే తప్ప ప్రజలకు మేలు చేయాలన్నది లేదన్నారు.



బంజర గ్రామంలో వరద బాధిత మహిళా రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సురేందర్

మక్కలు కొనుగోలు చేయాలి

ఉమ్మడి జిల్లాలో మక్క పంట చేతికొచ్చినా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు అమ్ముకుని నష్టపోవాల్సి వస్తోందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మద్దతు ధరకు అదనంగా క్వింటాలుకు రూ. 4 వందలు చెల్లించి మక్కలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సోయా పంటకూ క్వింటాలుకు రూ. 5 వందలు అదనంగా చెల్లించాలన్నారు. రాష్ట్రంలో ప్రజల సమస్యలను గాలికొదిలేసీ కమీషన్లు వచ్చే వాటిపైనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టి పెట్టిందని విమర్శించారు. తప్పుడు కేసులతో కేటీఆర్, హరీశ్‌రావులను జైలులో పెట్టాలని కుట్రలు చేస్తున్నాడని, బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం కేసులకు భయపడదని పేర్కొన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సీఎంనుంచి ప్రత్యేక ప్యాకేజీ తెస్తానన్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు.. ప్రపంచ బ్యాంకు నుంచి ప్రత్యేక ప్యాకేజీ అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటూ ఎంత మందిని ఆదుకున్నాడో చెప్పాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రశ్నించారు.

రైతులకు కష్టాలు..

జిల్లాలో మంత్రి లేడని, ఇన్‌చార్జి మంత్రి సీతక్క వచ్చి చూసింది లేదని హరీశ్‌రావు విమర్శించారు. ఈ ప్రభుత్వంలో రైతులకు యూరియా కష్టాలు తప్పలేదని, యాసంగిలో బోనస్ డబ్బులు ఇప్పటికీ రాలేదని పేర్కొన్నారు. పోచారం కాలువలకు పడిన గండ్లను ఇప్పటికీ పూడ్చడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క చెక్ డ్యాం, ఒక్కచెరువు నిర్మించింది లేదని, గండ్లు పడితే పూడ్చే తెలివి కూడా లేకుండాపోయిందని పేర్కొన్నారు. రోడ్లు భవనాల మంత్రి కోమటిరెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వరదల్లో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, చెరువులు, కాలువలకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు స్పష్టత వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రజలంతా కేసీఆర్ పాలన కోరుకుంటున్నారన్నారు. ఈసారి వంద సీట్లతో అధికారంలోకి వస్తామని, కొందరు పోలీసు అధికారులు అతిగా వ్యవహరిస్తున్నారని, వాళ్ల పద్ధతి మార్చుకోకపోతే సంగతి తేలుస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్‌లోకి మాజీ జెడ్పీటీసీ, ఎన్ఆర్ఐ..

గాంధారి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు హరాళే తానాజీరావ్, ఎన్ఆర్ఐ కిషోర్‌రెడ్డిలతో పాటు గాంధారి మండలానికి చెందిన 150 మంది మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్ సింధే, జనార్దన్‌గౌడ్, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, పార్టీ నాయకులు మనోహర్‌రెడ్డి, సిద్దయ్య, రాజేశ్వర్‌రావ్, శివాజీరావ్, సాయిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, సత్యం రావ్, సత్యం, పత్తిరాజు, రమేశ్, శ్రీనివాస్, ముదాం సాయిలు తదితరులు పాల్గొన్నారు.



గాంధారి మాజీ జెడ్పీటీసీ తానాజీరావును బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న హరీశ్‌రావు

నెల రోజుల తర్వాత తీరిందా?

- హరీశ్‌రావుపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ధ్వజం

కామారెడ్డి టౌన్ : ప్రకృతి వైపరీత్యంతో ఇబ్బంది పడ్డ వారిని పరామర్శించడానికి మీకు నెల రోజుల తర్వాత తీరిందా అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాజీ మంత్రి హరీశ్‌రావును నిలదీశారు. ఆయన పర్యటన ఇక్కడి ప్రజలపై ప్రేమతో కాదని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమేనని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో వర్షాలు, వడగళ్ల వానలతో అనేక సార్లు పంట నష్టం జరిగిందని, ఒక్కసారైనా రైతులను ఆదుకోలేదని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదలతో ప్రజలు ఇబ్బంది పడ్డప్పుడు బీఆర్ఎస్ నాయకులు ఎటు పోయారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి వరద బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం కింద రూ.11 వేల చొప్పున, చనిపోయిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున అందించారని తెలిపారు. నాలుగు గంటలలో రోడ్లను మరమ్మతు చేసి రాకపోకలను పునరుద్ధరించారన్నారు. బీఆర్ఎస్‌ను ప్రజలు మర్చిపోయే రోజులు వచ్చాయన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

'వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి'

కామారెడ్డి క్రైం : అధిక వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం భారీ వర్షం ప్రారంభం కావడంతో ఇటీవల జిల్లా కేంద్రంలో ముంపునకు గురైన హౌసింగ్‌బోర్డు, జీఆర్ కాలనీలలో కలెక్టర్ పర్యటించారు. మురికి కాలువలతో పాటు ప్రధాన రహదారిపై ఉన్న వాగు ఉధృతిని పరిశీలించారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో జరిగిన నష్టాలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. చెరువులు, వాగులు, ఇతర నీటి వనరుల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏదైనా అత్యవసరం ఉన్నట్లయితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 08468–220069 కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డీటీ రవికుమార్, దేవునిపల్లి ఎస్సై రంజిత్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

దంచికొట్టిన వాన

- జిల్లా అంతటా భారీ వర్షం
- కామారెడ్డిలో రోడ్లన్నీ జలమయం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తుపాను ప్రభావంతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా వాన దంచికొట్టింది. కొన్నిచోట్ల భారీ వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో కురిసిన భారీ వర్షంతో వరద రోడ్లను ముంచెత్తింది. నిజాంసాగర్ రోడ్డు, సిరిసిల్ల రోడ్డు, అశోక్‌నగర్, విద్యానగర్ తదిరత ప్రాంతాల్లో వరద నీటితో రోడ్లు చెరువులను తలపించాయి. జిల్లాలోని కామారెడ్డి, దోమకొండ, తాడ్వాయి, లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, గాంధారి, సదాశివనగర్, రాజంపేట, భిక్కనూరు తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. నెలన్నరగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఆగస్టు చివరి వారంలో కురిసిన భారీ వర్షంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రోడ్లు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. చెరువులకు గండ్లు పడ్డాయి. వాటి మరమ్మతులు పూర్తి కాకముందే మరోసారి తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఆదివారం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో బయటకు వెళ్లిన జనం ఇబ్బందులు పడ్డారు. లింగంపేట, తాడ్వాయి తదితర మండలాలలో మొక్కజొన్న, సోయా, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది.



కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ రోడ్డులో నిలిచిన వరద నీరు



నిజాంసాగర్ రోడ్డులో వరద



విద్యానగర్‌లో ఇంట్లోకి చేరిన వరద నీరు

చి'వరి'కి దోమపోటు!

- దెబ్బతింటున్న పంట
- ఆందోళన చెందుతున్న రైతులు



సుడిదోమ ఉధృతితో దెబ్బతింటున్న వరిపంట

నిజాంసాగర్ : వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరిపంటను తెగుళ్ల వెంటాడుతున్నాయి. ముందస్తుగా సాగు చేసిన సన్నరకాలతో పాటు దొడ్డురకం పంటకు కోతదశలో దోమ ఉధృతికి దెబ్బతింటోంది. దోమ ప్రభావంతో చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

బాన్సువాడ డివిజన్ పరిధిలోని బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, బిచ్కుంద, డోంగ్లీ, మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల పరిధిలో 1.25 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యింది. ఇందులో అత్యధికం సన్నరకాలే.. అయితే సన్నాలపై తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. ప్రధానంగా కోతకు వచ్చిన వరి పంటను సుడిదోమ చుట్టేస్తోంది. దీని ఉధృతి కారణంగా చేతికొచ్చిన పంట కళ్ల ముందు నాశనమవుతుండడంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.



అమర్‌ప్రసాద్, ఇన్‌చార్జి ఏడీఏ, బిచ్కుంద

దోమ వ్యాప్తికి కారణాలు

వరి పంటపై యూరియా వాడకం మోతాదుకు మించడంతో పాటు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో దోమ వృద్ధి చెందుతోందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఉష్ణోగ్రతల్లో తేడాలు ఉండడం కారణంగా కూడా దోమ ప్రభావం ఎక్కువవుతోందంటున్నారు. దోమపోటు కారణంగా దిగుబడులు పడిపోతాయన్న ఆందోళన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది.

నివారణ చర్యలు..

సుడిదోమ నివారణకు బిచ్కుంద ఇన్‌చార్జి ఏడీఏ అమర్‌ప్రసాద్ సలహాలు, సూచనలు అందించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.

- ముందుగా పొలంలో ఉన్న నీటిని పూర్తిగా తీసివేయాలి.
- గాలి తగిలేలా పొలంలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి
- సుడిదోమ సమూహాన్ని నియంత్రించేందుకు పసుపు రంగు జిగురు అట్టలను ఎకరానికి 10–12 ఏర్పాటు చేసుకోవాలి
- సుడిదోమ నివారణకు బుప్రోఫెజిన్ ముందును ఎకరానికి 120 గ్రాములు లేదా డైనోటిఫ్యూరాన్ మందును ఎకరానికి 100 గ్రాముల మందును నీళ్లలో కలిపి మొక్కల మొదళ్లలో పిచికారి చేయాలి.
- సుడిదోమ ఉధృతి అధికంగా ఉన్నట్లయితే ఫైమెట్రోజిన్– డైనోటెఫ్యూరాన్ 100 గ్రాముల మందును ఎకరానికి పిచికారి చేసుకోవాలి.
- సుడిదోమ ఉధృతి తగ్గే వరకు పంటలో నత్రజని ఎరువుల వాడకాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలి.

మక్కల ధర ఢమాల్!

- క్వింటాలుకు రూ. 300 తగ్గింపు
- తుఫాను హెచ్చరికతో రైతుల ఆందోళన
- తక్కువ ధరకే విక్రయిస్తున్న వైనం

బాల్కొండ: మక్క రైతులకు ధరాఘాతం తప్పడం లేదు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ. 2,400 ప్రకటించింది. అయితే ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు వెంటాడుతుండటంతో రైతులు దిక్కుతోచకుండిపోయారు. మొదట్లో నూర్పిళ్లు చేసి ఆరబెట్టిన మక్కలు వర్షార్పణం కావడంతో మద్దతు ధర దక్కకున్నా విక్రయించుకున్నారు. దీంతో క్వింటాల్‌కు రూ.2200 వరకు ధర పొందారు. ప్రస్తుతం మళ్లీ తుఫాన్ ఉందంటూ వాతావరణశాఖ హెచ్చరించడంతో వ్యాపారులు ధరను మరింత తగ్గించారు. క్వింటాల్‌కు రూ.2030లకే కొనుగోలు చేస్తున్నారు. తుఫాన్ దడ రైతుల్లో ఉండటంతో వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. డిమాండ్ లేదంటూ ధర తగ్గించడమే కాకుండా నగదులోనూ కోత విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదంటున్నారు. ఎకరా 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా, క్వింటాలుకు కనీసం రూ.300 వరకు ధర తగ్గిస్తుండడంతో రూ.9వేలు నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలంటున్నారు.

క్లుప్తంగా

కుంట రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అలయ్‌బలయ్



భిక్కనూరు: తిప్పాపూర్‌లో కుంట రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. దసరా ఉత్సవాల సందర్భంగా స్థానిక గ్రామదేవతల ఆలయాల ప్రాంగణంలో ఈ అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న కుంట రెడ్డి సంఘం సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలకు పలు పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు.

ఆదివారం ఆటవిడుపు..!



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆదివారం సెలవుదినం కావడంతో చిన్నారులు చెరువు అలుగుపై నుంచి పారుతున్న నీటిలో ఆటవిడుపునకు వచ్చారు. నాగిరెడ్డిపేట మండలంలోని జప్తిజాన్కంపల్లి ఊరచెరువు అలుగు పైనుంచి పొంగి పొర్లుతున్న నీటిలో చిన్నారులు ఒక చీర ముక్క సాయంతో చేపలు పడుతూ గడుపుతున్నారు.

సిరికొండలో భారీ వర్షం

సిరికొండ: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. వర్షంతో కోతకు వచ్చిన పంటలకు ఇబ్బంది నెలకొంది. కొండూర్ గ్రామంలో వరి కోతలు నడుస్తుండటంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడ్కోల్, న్యావనంది, నర్సింగ్‌పల్లి, చీమన్‌పల్లి గ్రామాల్లో మొక్కజొన్న, సోయాబీన్ కోతలు నడుస్తున్నాయి. వర్షానికి మక్కలు, సోయలు తడిచే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నా. పంట ఉత్పత్తులు తడవకుండా వాటిని తాటిపత్రులు, పాలిథిన్ కవర్లతో కప్పి కాపాడుకుంటున్నారు.

నేడు పీవో, ఏపీవోలకు శిక్షణ

ఎల్లారెడ్డిరూరల్: మీసాన్‌పల్లి రైతు వేదికలో సోమవారం పీవో, ఏపీవోలకు ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, శిక్షణ కార్యక్రమానికి సకాలంలో పీవో, ఏపీవోలు హాజరుకావాలని ఆయన కోరారు.

'అభయహస్తం' వాపస్ వచ్చేదెప్పుడో?

2017లోనే రద్దయిన పథకం

- సభ్యులకు సొమ్ము తిరిగివ్వడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం
- జిల్లాలోని మహిళలకు రావాల్సిన బకాయి రూ.12.67 కోట్లు



మోర్తాడ్(బాల్కొండ): మహిళా సంఘాల్లోని సభ్యులకు 55 ఏళ్ల వయస్సు నిండితే వారికి పింఛన్ పథకం అమలు చేయడానికి ఉమ్మడి రాష్ట్రంలో 'అభయహస్తం' పథకాన్ని అప్పటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. కానీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నూతన ప్రభుత్వం ఆసరా పథకం అమలు చేసి వివిధ వర్గాల వారికి పింఛన్లను మంజూరు చేసింది. ఈక్రమంలో 2014 నుంచి 2017 వరకు అభయహస్తంను అమలు చేసి ఆకస్మాత్తుగా రద్దు చేసింది. పథకం రద్దు చేసినప్పుడు మహిళలకు వారి సభ్యత్వ సొమ్మును వాపసు చేయాల్సి ఉన్నా గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో ఏళ్లుగా డబ్బుల కోసం మహిళలకు ఎదురుచూపులు తప్పడం లేదు.

జిల్లాలో 50వేలకు పైగా సభ్యులు..

అభయహస్తం పింఛన్ పథకం కింద ఉమ్మడి జిల్లాలో మొదట 13,506 మంది అర్హులుగా గుర్తించి వారితో రూ.3,685 చొప్పున జమ చేయించారు. వీరికి ప్రతి నెలా రూ.500ల చొప్పున పింఛన్ అందించారు. తర్వాత మరో 40వేల మందిని సభ్యులుగా చేర్చుకుని వారితో ప్రతి సంవత్సరం రూ.385 చొప్పున ఐదేళ్ల పాటు రూ.1,925ని జమ చేయించారు. కానీ అభయహస్తం పథకంను 2017లో నిలుపుదల చేశారు. అప్పటి నుంచి ఈ పథకం కింద పింఛన్ల పంపిణీ రద్దు చేయడంతో పాటు పింఛన్ పొందడానికి అర్హత వయస్సు వచ్చిన వారి సొమ్మును బ్యాంకులోనే ఉంచారు. ఇలా జిల్లాలోని మహిళలకు సంబంధించి రూ.12,67,69,610 బ్యాంకులోనే మూలుగుతున్నాయి.

ఈ సొమ్ము సంబంధిత అర్జీదారులకు వాపసు చేయడానికి ఏడాది కింద మహిళా సంఘాల ప్రతినిధులు అభయహస్తం సభ్యత్వ రుసుం చెల్లించిన మహిళల వివరాలను నమోదు చేసుకున్నారు. కానీ ఇప్పటికీ కూడా సొమ్మును తిరిగి ఇవ్వలేదు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా కొనసాగిస్తున్న మహిళా సంఘాల్లో మెజార్టీ మహిళలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే ఉన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం స్పందించి మహిళల పరిస్థితిని అర్థం చేసుకుని అభయహస్తం సభ్యత్వ సొమ్మును వారి ఖాతాల్లో జమ చేయాలని పలువురు కోరుతున్నారు.

వివరాలు ప్రభుత్వానికి పంపించాం..

అభయహస్తం పథకం కింద తమవంతు వాటా ధనం చెల్లించిన సభ్యుల వివరాలను గతంలోనే ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే దరఖాస్తుదారుల ఖాతాల్లో వారు గతంలో చెల్లించిన సొమ్ము జమ అయ్యే అవకాశం ఉంది. వివరాలు పంపించి చాలా నెలలు అవుతుంది. ప్రభుత్వం నుంచి స్పందన రావాల్సి ఉంది.

–తడకల శ్రీనివాస్, సీసీ సెర్ప్, మోర్తాడ్

ఆధ్యాత్మికం

ఘనంగా శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెదలో శబరిమాత ఆశ్రమానికి సంబంధించి ఆదివారం 36వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గీతాపారాయణం, ధ్వజారోహణ కార్యక్రమాలను చేపట్టారు. దీంతోపాటు శబరిమాత చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి గ్రామంలోని ప్రధానవీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తూ పల్లకిసేవ చేశారు. రాత్రి వివిధ భజన మండళ్లతో భజనలు జరిపారు.

రూ.67 వేలు పలికిన లడ్డూ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రాహ్మణపల్లిలో దుర్గామాతాసేవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద ఉన్న లడ్డూకు శనివారం రాత్రి వేలం పాట నిర్వహించారు. ఈవేలం పాటలో స్కామర్స్ టీం పాల్గొని లడ్డూను రూ.67,201లకు దక్కించుకున్నారు. టీం సభ్యులు మాట్లాడుతూ.. ఈ లడ్డూను గ్రామప్రజలకు పంపిణీ చేసి సంతోషాన్ని పంచుకుంటామన్నారు.

లాటరీల్లో బంగారం బహుమతులు గెలుచుకున్న భక్తులు

గాంధారి(ఎల్లారెడ్డి): వినాయక మండలపాల వద్ద లడ్డూల వేలం మాదిరిగానే దేవీ మండపాల్లో ఏర్పాటు చేసిన లడ్డూలను కూడా వేలం వేస్తున్నారు. భక్తులు వేల రూపాయలు వేలం పాట పాడి లడ్డూలను దక్కించుకున్నారు. మండల కేంద్రంలో మూడు కాలనీల్లో దేవీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. నవ దుర్గా సేనా యూత్, దుర్గా యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మండపాలవద్ద అర తులం బంగారం చొప్పున భక్తులకు కూపన్లను లక్కీ లాటరీ పద్ధతిలో డ్రా తీసి బహుమతిగా అందజేశారు. పత్తి సాయిలు, వడ్ల ప్రశాంత్‌కు అర తులం బంగారం చొప్పున బహుమతులు దక్కించుకున్నారు. నవ దుర్గా సేనా యూత్ లడ్డూను వేలంలో రొడ్డ ప్రతాప్ రెడ్డి రూ.55 వేలకు, దుర్గా యూత్ లడ్డూను తాడ్వాయి భాస్కర్ రూ.50 వేలకు, స్వేచ్ఛా యూత్ లడ్డూను రామ్ దశ్ గణేష్ యూత్ సభ్యులు రూ.30,111కు దక్కించుకున్నారు.

దుర్గామాత విగ్రహ నిమజ్జనం



బీబీపేట: మండల కేంద్రంలోని భైరవి యూత్ ఆధ్వర్యంలో నవరాత్రులు పూజలందుకున్న దుర్గామాత శోభాయాత్ర ఘనంగా ముగిసింది. నాందేడ్ నుంచి వంద మంది కళాబృందాన్ని రప్పించి వారి ఆట పాటలు, బ్యాండ్ చప్పుళ్లతో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని బుర్జు ప్రాంతంలో శోభాయాత్రను ప్రారంభించి గ్రామ కాలనీలో ఊరేగించి నిమజ్జనం చేశారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన భానోత్ శంకర్

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులోగల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై అంజనేయులు ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. లక్ష్మినగర్ తండాకు చెందిన భానోత్‌శంకర్ (55) ఆదివారం జంగంపల్లి గ్రామశివారులోగల జాతీయ రహదారి పక్కన సీతాఫలాలు విక్రయిస్తూ, తన టీవీఎస్ మోపెడ్‌పై కూర్చున్నాడు. అదే సమయంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బ్రిజా కారును డ్రైవర్ అతివేగంగా నడుపుతున్నాడు. జంగంపల్లి శివారులో కారు ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న మనోహర్, నిశాంత్‌లకు గాయలయ్యాయి. అనంతరం కారు సీతాఫలాలు విక్రయిస్తున్న బానోత్‌శంకర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైవివరించారు.

'స్థానిక' అభ్యర్థులు నిబంధనలు పాటించాల్సిందే

మీకు తెలుసా..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. ఈనెల 8న కోర్టు ఎలాంటి అడ్డంకులు చెప్పకుంటే 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈక్రమంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎంత మేర ఖర్చు చేయాలనే దానికి సంబంధించి ఇప్పటికే ఎన్నికల కమిషన్ నిబంధనలను విడుదల చేసింది. ఫలితాలు వెలువడిన 45 రోజుల్లో ఖర్చుల వివరాలను అభ్యర్థులు కమిషన్‌కు సమర్పించాల్సి ఉంటుంది.

- జెడ్పీటీసీ అభ్యర్థికి రూ.4లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థికి రూ.1లక్షా 50వేల వ్యయ పరిమితి ఉంటుంది.
- 5వేలు అంత కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థికి రూ.2లక్షల 50వేలు, వార్డు సభ్యుడికి రూ.50వేలు వ్యయ పరిమితి ఉంది.
- 5వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి రూ.1లక్షా 50వేలు, వార్డు సభ్యుడికి రూ.30 వేలు పరిమితి విధించారు.
- అభ్యర్థి పోటీ చేసే ప్రాంతంలో రాజకీయ పార్టీలు చేసే ఖర్చు కూడా అభ్యర్థి ఖాతాలోకి జమవుతుంది.
- ఫలానా అభ్యర్థి అని కాకుండా పార్టీ తరపున పోటీ చేసే వారందరి కోసం సాధారణ ప్రచారానికి చేసే ఖర్చులను మాత్రం అభ్యర్థుల ఖాతాల్లో చూపించాల్సిన అవసరం లేదు.
- జెడ్పీటీసీ అభ్యర్థులు జెడ్పీ సీఈవోకు, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులు అభ్యర్థులు ఎంపీడీవోకు ఖర్చుల వివరాలను సమర్పించాలి.
- నిర్ణీత సమయంలోగా ఎన్నికల వ్యయ వివరాలు ఇవ్వకుంటే పదవిని కోల్పోయినట్లేనని చట్టం చెబుతోంది.
- అభ్యర్థులు గెలిచినా, ఓడినా ఎన్నికల్లో పెట్టిన ఖర్చుల వివరాలను సమర్పించటం మాత్రం తప్పనిసరి.
- ఎన్నికల్లో ఓడిపోయాం కదా.. వివరాలను సమర్పించకున్నా ఇబ్బందేమీ లేదు అనుకుంటే భవిష్యత్‌లో మరోసారి ఎన్నికల్లో పోటీకి ఇబ్బందులు తప్పవు.

గంగమ్మ ఒడికి దుర్గామాత



ఆర్మూర్‌లోని గూండ్ల చెరువు వద్దకు నిమజ్జనం కోసం చేరుకున్న దుర్గామాత విగ్రహాలు

ఆర్మూర్‌టౌన్/రుద్రూర్: ఆర్మూర్ పట్టణంలోని దుర్గామాతా శోభాయాత్ర ఆదివారం మూడో రోజూ కొనసాగింది. పట్టణంలో పలు మండపాల నిర్వాహకులు దుర్గామాత్ర శోభాయాత్రను డీజే పాటలతో, డప్పువాయిద్యాలతో దండియా ఆటలతో నిర్వహించారు. యువ యూత్ నిర్వాహకులు దుర్గామాత నిమజ్జనం కోసం లక్నో నుంచి అఘోరాల వేషధారణ విన్యాసకులను రప్పించారు. వీరి చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్స్ యూత్ సభ్యులు కాశీ తరహాలో గంగాహారతి కార్యక్రమం నిర్వహించారు, రజక సంఘం ఆధ్వర్యంలో కళాకారులు కాళికామాత వేషధారణలో అలరించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో గూండ్ల చెరువు వద్ద ఏర్పాటు చేసిన క్రేన్ సహాయంతో దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేశారు. అలాగే కోటగిరిలోనూ దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర ఘనంగా జరిగింది.



కాళికామాత వేషధారణలో నృత్యం చేస్తున్న కళాకారిణి



అఘోరా వేషధారణలో కళాకారుడి విన్యాసాలు



కోటగిరిలో..

ఎన్నికల్లో విజయ దుందుభి మోగించాలి



పాల్వంచ మండల కేంద్రంలో కార్యకర్తలతో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

మాచారెడ్డి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయ దుందుభి మోగించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం పాల్వంచ మండల కేంద్రంలో మున్నూరు కాపు కల్యాణ మండపాన్ని ప్రారంభించిన అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులకు బీజేపీ అభ్యర్థులు బరిలో నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కోరారు. పాల్వంచ మండల శాఖ అధ్యక్షుడు అనిల్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బాల్ రాజు, మండల ఇన్‌చార్జి పండ్ల ప్రవీణ్, నాయకులు ఎం.శ్రీనివాస్, నరసింహాచారి, నరేష్, శ్రీనివాస్ ఉన్నారు.



పెర్కిట్ జెడ్పీహెచ్ఎస్ 1996-97 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు



భిక్కనూరు జెడ్పీహెచ్ఎస్ 1982-83 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు



బాన్సువాడ పట్టణంలోని 1979-80 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

దశాబ్దాల తర్వాత.. ఒక్కచోటికి..

- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఆత్మీయ పలకరింపులతో భావోద్వేగానికి గురైన చిన్ననాటి మిత్రులు



భిక్కనూరు ప్రభుత్వ పాఠశాల 2002-03 బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థులు



పిట్లం జెడ్పీహెచ్ఎస్ 1993-96 బ్యాచ్ 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులు

భిక్కనూరు/బాన్సువాడ రూరల్/పిట్లం/పెర్కిట్: చిన్ననాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్కచోటికి చేరడంతో హర్షం వ్యక్తం చేశారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని భావోద్వేగానికి గురయ్యారు. బాన్సువాడలోని జీజేసీలో 1979-80 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆదివారం తాడ్కోల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆనాటి గురువులు మధుసూదన్, వెంకటసుబ్బయ్యలను విద్యార్థులు సన్మానించారు. రామకృష్ణారెడ్డి, నార్ల భాస్కర్, రమేష్, బ్రహ్మం, రాంరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1982-83 ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు మాసుపల్లి పోచమ్మ ఆలయం వద్ద ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమ పూర్వ విద్యార్థుల కమిటీ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేషం, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధానకార్యదర్శిగా కుషన్ మల్లేషం, కోశాదికారిగా ఉప్పరి యాదగిరితోపాటు పలువురిని ఎన్నుకున్నారు., అలాగే భిక్కనూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల 2002-03 బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పిట్లం జెడ్పీహెచ్ఎస్ 1993-96 బ్యాచ్ 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. పెర్కిట్ జెడ్పీహెచ్ఎస్ 1996-97 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఓ ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనం నిర్వహించారు.

ఎల్లారెడ్డిలో ప్రతియేటా..



ఎల్లారెడ్డి జెడ్పీహెచ్ఎస్ (బాలుర) 1992-93 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని ఎల్లారెడ్డి ప్రభుత్వ (బాలుర) ఉన్నత పాఠశాల 1992-93 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు గత ఐదేళ్లుగా ప్రతి సంవత్సరం సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పూర్వ విద్యార్థులందరూ పాల్గొని, ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఇటీవల మృతి చెందిన మిత్రులకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన వీరంతా జీవితంలో మంచి స్థానంలో స్థిరపడ్డారు. దీంతో బాల్యమిత్రులలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తు అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆనందంగా ఉంటుంది..



నేను ఎల్లారెడ్డిలోనే బాల్యమిత్రులతో కలిసి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తిగా పని చేస్తున్నాను. ప్రతియేటా బాల్యమిత్రులను కలిసేందుకు ఎల్లారెడ్డికి వస్తున్నాను. బాల్య మిత్రులను కలిస్తే ఎనలేని సంతోషం కలుగుతుంది.

– నామ సంతోష్‌కుమార్, రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి

మరువలేని అనుభూతి



బచ్‌పన్ దోస్తులను కలవడం మరువలేని అనుభూతి. ప్రతియేటా బచ్‌పన్ దోస్తులను కలవడం ఆనందాన్ని కలిగిస్తుంది. కుటుంబం ఎంత ముఖ్యమో చిన్ననాటి స్నేహితులు కూడా అంతే ముఖ్యంగా అనిపిస్తుంది.

– రేవంతప్ప, ఏవో, కలెక్టరేట్, సిరిసిల్లా

ఎన్ని పనులున్నా వస్తాను..



ఎన్ని పనులున్నా చిన్ననాటి మిత్రులను కలుసుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి తప్పకుండా వస్తాను. చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉంటుంది.వారితో సుఖసంతోషాలను పంచుకోవడం జరుగుతుంది.

– చెన్నకేశవులు, సీబీఐ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్

మిత్రులతో సంతోషం



మిత్రులను కలిస్తే ఎనలేని ఆనందం కలుగుతుంది. బాల్యమిత్రులందరు వివిధ ప్రాంతాలలో ఉంటు ప్రతియేటా గెట్‌టుగెదర్ కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉంటుంది.

– సిద్ది శ్రీధర్, వ్యాపారవేత్త

క్రైం కార్నర్

అయిలాపూర్‌లో వివాహిత ఆత్మహత్య



భాగ్యలక్ష్మి (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా.. అయిలాపూర్ గ్రామానికి చెందిన కొట్టంల భాగ్యలక్ష్మి(20) అనే వివాహిత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఆమె జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి కూతురు భవ్యశ్రీ ఉన్నట్లు తెలిపారు. మృతురాలి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్తపల్లిలో ఒకరు..

మాచారెడ్డి: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వివరాలు ఇలా.. కొత్తపల్లి గ్రామానికి చెందిన బరిగే నాంపల్లి (54)కి కూతురు, కుమారుడు ఉండగా గతంలో మృతిచెందారు. ఈ బాధను తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో తాగుడుకు బానిసయ్యాడు. దీంతో శనివారం రాత్రి పొలం వద్ద వేపచెట్టుకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కానిస్టేబుల్‌ను చితకబాదిన గ్రామస్తులు!

రెంజల్(బోధన్): ఇటీవల సస్పెన్షన్‌కు గురైన ఓ కానిస్టేబుల్‌ను మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో కాలనీవాసులు చితకబాదినట్లు తెలుస్తోంది. గ్రామంలో జూన్ నెలలో ఓ మహిళను పలు ఆరోపణలపై స్థానికులు పట్టుకుని చెట్టుకు కట్టేసి తీవ్రంగా చితకబాదారు. ఈ విషయంలో సదరు మహిళ సమస్యను పరిష్కరిస్తానని సస్పెన్షన్‌కు గురైన కానిస్టేబుల్ ఆమె లొంగదీసుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈక్రమంలో శనివారం రాత్రి కానిస్టేబుల్ సదరు మహిళ ఇంటికి రావడంతో కాలనీవాసులు పట్టుకుని తీవ్రంగా చితకబాదినట్లు సమాచారం. అలాగే అతడి బైక్‌ను పట్టుకుని స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయమై రెంజల్ ఎస్సై చంద్రమోహన్‌ను వివరణ కోరగా తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు. సదరు కానిస్టేబుల్ గతంలో నిజామాబాద్‌లోని 6వ టౌన్‌లో విధులు నిర్వహించగా కొన్ని నెలల క్రితం రెంజల్ పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఇటీవలనే హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన ఆయనను పలు వివాదాల కారణంగా గత నెలలో ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించారు.

కరెంట్ షాక్‌తో గేదె మృతి



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ గ్రామంలో ఆదివారం కరెంట్ షాక్‌తో గేదె మృతిచెందింది. గ్రామంలోని సిర్నపల్లి సాయిలుకు చెందిన పాడి గేదె మేత కోసం గ్రామ శివారులో ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. అక్కడ గేదెకు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో తనకు సుమారు రూ.80వేల మేర ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. ట్రాన్స్‌కో అధికారుల నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.